

ఎస్కే కరీముల్లా



సంఘటనా స్థలం దృశ్యం



ముద్దిని వేణు



బేతి సురేష్

రోడ్డు పక్కన మృత్యువు

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్.. ముగ్గురి దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు యువకులు, ఒక బాలుడు
- తలలు పగిలి అక్కడికక్కడే మృతి
- నెత్తుటిధారలతో భయానకంగా మారిన సంఘటన స్థలం
- సత్తుపల్లి మండలం రామగోవిందాపురంలో విషాదం

సత్తుపల్లి రూరల్, ఆగస్టు 1: రోడ్డుపై నిలిపి ఉంచిన ఓ లారీ మూడు నిండు ప్రాణాలను బలితీసుకుంది. రెండు నిమిషాల్లో గ్రామానికి చేరుకుంటామనగా వారు ప్రయాణిస్తున్న బైక్... ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఒక బాలుడు, ఇద్దరు యువకులు ఉన్నారు. ఈ ఘటనతో మూడు కుటుంబాల వారు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని రామగోవిందాపురం గ్రామానికి చెందిన ఎస్కే నజీర్, మున్నీ దంపతుల కుమారుడు కరీముల్లా(11) గంగారం హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ముద్దిని వేణు (19), బేతి సురేష్ (25) తాపీ కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం వీరిద్దరూ పని ముగించుకొని గంగారం నుంచి స్వగ్రామం రామగోవిందాపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పుడే స్కూల్ వదలడంతో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న కరీముల్లాను వేణు, సురేష్‌లు తమ బైక్‌పై ఎక్కించుకున్నారు. ముగ్గురూ కలిసి స్వగ్రామం వెళ్తుండగా... గంగారం శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అక్కడే రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు.

అందరివీ కన్నీటి గాథలే...

మృతుడు బేతి సురేష్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా పిల్లలు లేరు. ప్రమాద స్థలంలో సురేష్ భార్య అనూషతో పాటు మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మరో మృతుడు ముద్దిని వేణు అవివాహితుడు. ఇతని మృతితో తల్లి జ్యోతి, తండ్రి సురేష్‌లు కన్నీరుమున్నీరయ్యారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉండగా, ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందాడు. ఈ ఘటనలో 6వ తరగతి విద్యార్థి కరీముల్లా అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. కరీముల్లా రోజూ బడి నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్లేవాడు. కానీ గురువారం సాయంత్రం వేణు, సురేష్‌లు తమ బైక్‌పై ఎక్కించుకోవడం ప్రాణాలమీదికి తెచ్చింది. కరీముల్లా బైక్‌పైకి ఎక్కిన రెండు నిమిషాల్లోనే ఈ ఘటన జరిగింది. ఇతని తండ్రి నజీర్ టైర్ల కొట్టులో పనిచేస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన నజీర్.. గుండెలుబాదుకుంటూ విలపించాడు. బడికి వెళ్లి కొడుకును తీసుకురమ్మని భార్య చెప్పగా, నజీర్ కొంత ఆలస్యం చేశాడు. ఈ క్రమంలోనే కరీముల్లా బైక్ ఎక్కడం.. ప్రాణాలు కోల్పోవడం జరిగిపోయాయి.

భోజనం చేసేందుకు లారీని ఆపాడు..

హైదరాబాద్ నుంచి రాజమండ్రికి కెమికల్ లోడ్‌తో వెళ్తున్న లారీని డ్రైవర్ శేఖర్‌రెడ్డి హోటల్‌లో భోజనం చేసేందుకు రోడ్డు పక్కన నిలిపాడు. ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించే క్రమంలో బైక్ వచ్చి లారీనీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలలకు తీవ్రగాయాలు కావడంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. నెత్తుటిధారల మధ్యన చెల్లాచెదురుగా పడి వున్న మృతదేహాలతో సంఘటన స్థలం భయానకంగా మారింది. మృతదేహాలను చూసి స్థానికులు విలపించారు. జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఫలించిన వర్గీక'రణం'



చరిత్రాత్మక ఘట్టం



ఖమ్మం జెడ్పీ సెంటర్ వద్ద మాదిగల సంబురాలు

- ఎట్టకేలకు నెరవేరిన ఎమ్మార్పీఎస్ లక్ష్యం
- ఎస్సీ రిజర్వేషన్ విభజన అమలుకు సుప్రీంకోర్టు పచ్చజెండా
- ఎస్సీలోని కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం దక్కనున్న రిజర్వేషన్ ఫలాలు
- ప్రధానంగా లబ్ధిపొందనున్న మాదిగ సామాజికవర్గం
- కృష్ణ మాదిగ పోరాటానికి వెన్నంటి నిలిచిన ఉమ్మడి జిల్లా
- జిల్లా వ్యాప్తంగా మాదిగ సంఘాల సంబరాలు

ఖమ్మం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీల వర్గీకరణ లక్ష్యంగా దశాబ్దాల కాలంగా సాగుతున్న పోరాటం ఫలించింది. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన ఉద్యమం అనేక ఏళ్లుగా సాగుతూ.. మలుపులు తిరుగుతూ.. పడిలేస్తూ చివరకు సుప్రీంకోర్టు తీర్పుతో కొలిక్కివచ్చింది. రిజర్వేషన్లపై ఆ సామాజికవర్గం కల ఎట్టకేలకు నెరవేరింది. రిజర్వేషన్ల వర్గీకరణ అధికారాన్ని సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రాలకే అప్పగిస్తూ తీర్పునిచ్చింది.

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం 2000వ సంవత్సరంలో మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేసింది. ఆ తర్వాత హైకోర్టు నిలిపివేయడంతో రిజర్వేషన్ నిలిచిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం విస్తృతంగా సాగింది. కృష్ణమాదిగ ఉమ్మడి జిల్లాలో అనేక మండలాల్లో పట్టణాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో మాదిగ సామాజికవర్గంతో పాటు ఇతర కులాలు కూడా ఎంఆర్‌పీఎస్ ఉద్యమానికి మద్దతు ప్రకటించాయి. విద్యార్థి జేఏసీ, యువజన, మహిళ, ఉద్యోగ, అధికారులు, న్యాయవాదులు పలు సంఘాలుగా ఏర్పడి ఎంఆర్‌పీఎస్ ఉద్యమానికి ఊతం ఇచ్చారు. కృష్ణమాదిగ పిలుపునందుకుని క్షేత్రస్థాయి నుంచి ఢిల్లీస్థాయి వరకు ఆందోళనలో పాల్గొన్నారు.

తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు మాదిగలు తమ వాటా రిజర్వేషన్ పొందనున్నారు. ప్రస్తుతం విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు 15శాతం రిజర్వేషన్ అమల్లో ఉంది. బీసీలకు ఏ,బీ,సీ,డీ గ్రూపులు ఏర్పాటుచేసి ఆయా సామాజిక వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారంగా కేటాయింపులు జరిపారు. ఎస్సీ, ఎస్టీల్లో ఈ విధమైన కేటాయింపులు లేవు. దీంతో ఒకే సామాజకవర్గం నుంచి విద్య, ఉద్యోగ పరంగా లబ్ధి పొందుతున్నారన్న ఆవేదన అనేక ఏళ్లుగా ఆ వర్గాల్లో కనిపించింది.

ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పీఎస్ ఉద్యమం సాగిన నేపథ్యంలోనే కృష్ణమాదిగను స్ఫూర్తిగా తీసుకుని తుడుందెబ్బ పేరుతో ఎస్టీ వర్గీకరణ జరపాలని ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు షెడ్యూల్ ఏరియా, మైదాన ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, ఆందోళనలు సాగించారు. అయితే తుడుందెబ్బలో చీలికరావడంతో పాటు ఆదివాసీ వర్గాల్లో ఐక్యతా లోపంతో చీలిక వచ్చి ఎస్టీ వర్గీకరణ ఉద్యమంలో స్తబ్ధత ఏర్పడింది.

ఎంఆర్‌పీఎస్ ఉద్యమంలో కూడా పలు అవాంతరాలు వచ్చినప్పటికీ రాజకీయపార్టీల ఒత్తిడితో అక్కడక్కడ నాయకులు ఉద్యమం నుంచి పార్టీలోకి వెళ్లినా కృష్ణమాదిగ సారథ్యంలో ఎంఆర్‌పీఎస్ ఉద్యమాన్ని ఆ వర్గానికి చెందిన విద్యార్థి, ఉద్యోగ, మహిళ సంఘాలు ముందుకు తీసుకెళ్లగలిగాయి. ఫలితంగా జనాభా నిష్పత్తిలో మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కోటా ఎస్సీల్లో అమలు కాబోతోంది. దీంతో విద్య, ఉద్యోగ పరంగా సామాజిక న్యాయం జరుగుతుందని ఆ వర్గాలు ఆశిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో షెడ్యూల్డ్ ఏరియా ఉండడంతో కొన్ని చట్టాలు, జీవోల కారణంగా ఎస్సీలు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పొందలేకపోయారు. ఇటీవలే ఆ జీవోలను సుప్రీంకోర్టు నిలిపివేయడంతో ఎస్సీలకు కూడా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం కలిగింది.. ఇంజనీరింగ్, మెడికల్, పీజీ, డిగ్రీ, ఇంటర్‌తో పాటు పలు రెసిడెన్షియల్ కళాశాలలు, పాఠశాలలు, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, లా, ఎంబీఏ, బీఈడీ, తదితర విద్యాసంస్థల్లోనూ విభజన కారణంగా జిల్లాలోని మాదిగ ఉపకులాలు లబ్ధిపొందబోతున్నాయి. అలాగే జిల్లాలో సింగరేణి, భద్రాద్రి పవర్‌ప్లాంట్, కేటీపీఎస్, ఆయిల్‌పామ్, వంటి పరిశ్రమల్లోనూ ఎస్సీలో మెరిట్ ఆధారంగా ఆయా వర్గాలకు గ్రూపుల్లో ఉద్యోగవకాశాలు లభించనున్నాయి.

ప్రభుత్వం ఇప్పటికే డీఎస్సీతో పాటు గ్రూప్ 1, గ్రూప్ 2 వలు ప్రభుత్వ శాఖల్లో నోటిఫికేషన్లను విడుదల చేసింది. అయితే ఈ నోటిఫికేషన్లు ఎస్సీ కేటగిరిలో 15 శాతాన్ని మెరిట్ ఆధారంగా కాకుండా ఇక ఏ,బీ,సీ,డీ గ్రూపుల వారీగా ఎస్సీలను ఆయా కులాలకు కేటాయించిన కోటాలో విభజన జరిగి పలు కులాలకు లబ్ధి జరగబోతుంది. సుప్రీంకోర్టు తీర్పువెలువడిన నేపథ్యంలో ఎంఆర్‌పీఎస్ తోపాటు ఎస్సీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన , మహిళ ఉద్యోగ సంఘాలు పలుచోట్ల సంబరాలు, ర్యాలీలు నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు



తూరుగంటి అంజయ్య మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు

ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పోరాటం చేశాం. వర్గీకరణ ఉద్యమంలో అనేకమంది బలయ్యారు. వేలాదిమంది జైలు కెళ్లారు. ఎంతోమంది బిడ్డలను పోగొట్టుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు వల్ల మాదిగ, ఉపకులాలకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ తీర్పు ద్వారా ఇటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో యావత్ దక్షిణాది రాష్ట్రాలలో మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ సంక్షేమ రంగాలలో పూర్తి న్యాయం జరుగుతుందని మేం విశ్వసిస్తున్నాం. ఈ రోజు చరిత్రలో మరిచిపోలేని రోజు. సుప్రీంకోర్టు ఒక చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది.

35 ఏళ్ల సుదీర్ఘపోరాట ఫలితం



ఏపూరి వెంకటేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ నేత

30 ఏళ్ల ఎంఆర్‌పీఎస్ ఉద్యమంలో నాటి నుంచి నేటి వరకు పాల్గొన్న వారందరికీ ఈ విజయం అంకితం చేస్తున్నాం. మా పోరాటాన్ని సామాజిక న్యాయసమస్యగా పరిగణించి అండగా నిలిచిన సమాజానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ప్రజల సహకారంతో జాతికి వెయ్యేళ్ల భవిష్యత్ కోసం మంద కృష్ణమాదిగ నిరంతరం శ్రమించారు. ఆయన నిర్వహించిన దండోరా ఉద్యమ ఫలితమే ఎస్సీ వర్గీకరణ విజయం.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



వక్కలగడ్డ చంద్రశేఖర్, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక రాష్ట్ర చైర్మన్

వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయం. దీంతో ఎస్సీల్లో జనాభా దామాషా ప్రకారం 59 కులాలకు న్యాయం జరుగుతుంది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా ఆ రాష్ట్రాల్లో మెజారిటీ వర్గాలకు ఫలాలు అందుతాయి.

ఇంజనీరింగ్ కాలేజీలు కళకళ



కొత్త బంగారు లోకం

- ఉమ్మడి జిల్లాలో గతానికి భిన్నంగా నిండిన సీట్లు
- రెండో విడతలోనే 70 శాతం కేటాయింపులు
- కంప్యూటర్ కోర్సులకే జై.. సీఎస్‌ఈలో 91శాతం భర్తీ
- మెకానికల్, మైనింగ్ కోర్సుల్లో భర్తీ అంతంతమాత్రమే
- ఈ నెల 8 నుంచి చివరి దశ కౌన్సెలింగ్

ఖమ్మం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్పించుకునేందుకు ప్రత్యేకంగా కన్సల్టెన్సీలు ఏర్పాటు చేసి నజరానాలు అందించడం, చేరిన విద్యార్థులకు నగదు ఎదురివ్వడం, ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి చెక్కులు ఇప్పించే బాధ్యతలు తీసుకోవడం వంటి పదుల రకాల ప్రయత్నాలు చేసినా గతంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు చేరేందుకు ఇష్టపడేవారు కాదు. కానీ ఈ ఏడాది మాత్రం పరిస్థితి మారింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని కళాశాలల్లో ఈ ఏడాది మొదటి, రెండో దశల్లోనే 70శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. దాంతో గత కొన్నేళ్లుగా డీలాపడిన ఇంజనీరింగ్ కళాశాలలు మళ్లీ కళను సంతరించుకోనున్నాయి.

ప్రధాన కళాశాలలన్నీ 70 శాతం పైగానే..

ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు 20కి పైగా కళాశాలలుండి ఇంజనీరింగ్‌కు ఓ హబ్‌గా ఉండేది. కాలక్రమేణా ఆయా కళాశాలల్లో విద్యార్థులు తగ్గడంతో సంబంధిత యాజమాన్యాలు సైతం బోధనపై సరైనరీతిలో దృష్టి సారించలేదు. ఫలితంగా పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడి గురుకులాలుగా మారిన చరిత్ర ఉమ్మడి జిల్లాకు ఉంది. అయితే ఎక్కువస్థాయిలో కళాశాలలుండటం, వాటిల్లో బోధన సరిగ్గా లేదన్న ప్రచారం పెద్దఎత్తున సాగడంతో ఆ ప్రభావం మిగిలిన ప్రధాన ఇంజనీరింగ్ కళాశాలలపైనా పడింది. దాంతో ఆయా కళాశాలలకు సైతం అడ్మిషన్లు అంతంతమాత్రంగానే సాగాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న కళాశాలలపై యాజమాన్యాలు దృష్టిసారించి మళ్లీ గాడిలో పెడుతూ ముందుకుసాగడంతో ఈ ఏడాది గతానికి భిన్నంగా సీట్లు నిండాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 13 కళాశాలల్లో అన్ని కోర్సులు కలిపి 3,938 సీట్లు ఉండగా.. ఒకటవ, రెండవ విడత సీట్ల కేటాయింపులు ముగిసే సమయానికే 2,852 సీట్లు భర్తీ అయ్యాయి. వాటిల్లో అత్యధికంగా కంప్యూటర్ కోర్సులకే మొగ్గు చూపినట్టుగా స్పష్టమవుతోంది. సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) బ్రాంచిలో మొత్తం 1,151 సీట్లు ఉండగా.. ఇప్పటికే 1,051 సీట్లు, సీఎస్ఎం (కంప్యూటర్ సైన్ ఇంజనీరింగ్ మెషీన్ లెర్నింగ్)లో 508 సీట్లకుగాను 447, సీఎస్‌డీ(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్)లో 344 సీట్లకుగాను 248 సీట్లు భర్తీ అయ్యాయి. కాగా ఉమ్మడి జిల్లాలో మెకానికల్, మైనింగ్ సీట్లు తక్కువగా ఉన్నప్పటికీ అవి అంతంతమాత్రంగానే భర్తీ అయ్యాయి. మెకానికల్ మొత్తం సీట్లు 204 ఉండగా కేవలం 46, 135 మైనింగ్ సీట్లకుగాను 72సీట్లు భర్తీ అయ్యాయి.

పాలేరు జేఎన్‌టీయూలో 100 ఖాళీ

కాగా గతేడాది ప్రారంభించిన పాలేరు జేఎన్‌టీయూ యూనివర్సిటీ కళాశాలలో రెండో దశ కౌన్సెలింగ్ పూర్తయ్యే సరికి అన్నీ బ్రాంచిలలో కలిపి 100 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 330 సీట్లకుగాను 230 సీట్లు కేటాయింపులు పూర్తయ్యాయి. సీఎస్ఈలో 66 సీట్లకుగాను మొత్తం సీట్లు భర్తీ కాగా, ఈసీఈలో 66 సీట్లకు 60, సీఎస్‌డీలో 66 సీట్లకు 65 భర్తీ అయ్యాయి. ఈఈఈలో 66కు 28, మెకానికల్‌లో 66కు 11 సీట్లు మాత్రమే నిండాయి. ఇక కొత్తగూడెంలోని కేయూ ఇంజనీరింగ్ యూనివర్సిటీ కళాశాలలో మూడుబ్రాంచిలు ఉండగా ఈఈఈలో నాలుగు, మైనింగ్‌లో ఒక సీటు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. వీటితోపాటుగా ఉమ్మడి జిల్లాలో అన్నీ కళాశాలలు రెండు కళాశాలలు మినహా మిగిలిన కళాశాలలన్నీ 70 శాతం వరకు సీట్లు నిండాయి. కాగా ఈ నెల 8 నుంచి చివరిదశ కౌన్సెలింగ్ ప్రారంభం కానుండగా.. 17వ తేదీ నాటికి ముగియనుంది. చివరిదశ కౌన్సెలింగ్‌లోనూ ఇదే తరహాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఖమ్మం కళాశాలలపై మక్కువ చూపితే గడిచిన పదేళ్ల కాలానికి భిన్నంగా ఇంజనీరింగ్ కళాశాలలు మరింత కళను సంతరించుకోనున్నాయి.

'స్వామి నారాయణ'కు 13.7ఎకరాలు

- స్థలం కేటాయింపును ఆమోదించిన రాష్ట్ర కేబినెట్
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతుల ప్రారంభం
- అంతర్జాతీయ ప్రమాణాలతో అందనున్న విద్య
- రఘునాథపాలెం వద్ద నిర్మాణం కానున్న భవన సముదాయం
- ఫలించిన మంత్రి తుమ్మల చొరవ



విద్యాసేవ

రఘునాథపాలెంలో ఏర్పాటు చేయనున్న స్కూల్ భవనం

ఖమ్మం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతర్జాతీయ ప్రమాణాలతో ఖమ్మం సమీపంలోని రఘునాథపాలెం వద్ద జింకలతండా రోడ్డులో స్వామి నారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యాబోధన చేయబోతోంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఈ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం 13.7 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. లాభాపేక్ష లేకుండా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో సీబీఎస్ఈ ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందించనున్నారు. 1 నుంచి 12 వతరగతి వరకు ఇక్కడ విద్యాబోధన జరగనుంది. రెసిడెన్షియల్ పద్ధతిలో తక్కువ ఫీజులతో మన సంస్కృతిని పెంపొందించే విధంగా స్వామినారాయణ గురుకుల ట్రస్ట్ ఇక్కడ విద్యాసంస్థ నెలకొల్పుతోంది. రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలో గత 77ఏళ్లుగా విద్యాబోధనే సామాజిక సేవగా భావించి దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో స్వామినారాయణ విద్యాసంస్థలు ఏర్పాటుచేసి విద్యాబోధన సాగిస్తున్నారు. తక్కువ ఫీజులతోనే అత్యుత్తమ ఇంగ్లీష్ విద్యాబోధన ఇక్కడ లభించనుంది. డే స్కాలర్ విద్యార్థులకు సైతం ప్రత్యేక బస్సులను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. పూర్తిస్థాయిలో శిక్షణతో కూడుకున్న ఉపాధ్యాయులను, సిబ్బంది ద్వారా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహణ జరగనుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించిన విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, పలురకాల నైపుణ్యాలను విద్యార్థులకు కలిగించి దేశానికి, సమాజసేవ పట్ల అంకితభావం పెంపొందించేలా అన్ని అంశాల్లోనూ విద్యార్థులను తీర్చిదిద్దుతారు. రఘునాథపాలెం సమీపంలోని జింకలతండా రోడ్డులో 13.7ఎకరాలు ప్రతిపాదించి కేబినేట్ ఆమోదం తీసుకోవడం త్వరలో అధికారికంగా ఈ భూమిని ట్రస్టుకు అందించనున్నారు. ఆ వెంటనే పనులు ప్రారంభించి వచ్చే విద్యాసంవత్సరానికి ఇక్కడ విద్యాబోధన కూడా నిర్వహించనున్నారు. స్వామినారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో గురుకుల విద్యాలయం ఏర్పాటు ద్వారా వెలుగులతో కూడిన విద్య అందుబాటులోకి రానుందని మంత్రి తుమ్మల ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, మార్కెట్ ధరకు భూమిని కేటాయించి శ్రీస్వామినారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

వార్డెన్‌పై విద్యార్థుల దాడి

- దుర్వ్యసనాలు మానమనడమే కారణం
- అర్ధరాత్రి కరెంటు నిలిపివేసి మూకుమ్మడిగా దాడి
- భద్రాద్రి జిల్లా ఏకలవ్య పాఠశాలలో ఘటన

7


6న వైరా ఆయకట్టుకు నీరు విడుదల

- ఖరీఫ్ సాగుకు మార్గం సుగమం
- రిజర్వాయర్‌లో ప్రస్తుతం 12.3 అడుగుల నీటిమట్టం

6

సాధారణ స్థాయికి గోదావరి

సాగు భళా...



బిర బిరా కృష్ణమ్మ...

- నేడు నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి నీరు విడుదల
- హాజరవుతున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి
- మూడురోజుల్లో పాలేరు రిజర్వాయర్‌కు చేరనున్న జలాలు
- ఖరీఫ్‌లో సస్యశ్యామలం కానున్న 2.55 లక్షల ఎకరాలు

ఖమ్మం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులు సాగుకు సై అంటున్నారు. కృష్ణమ్మ ఎగువన కురిసిన వర్షాలతో శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రాజెక్టులు నిండి నాగార్జునసాగర్‌కు నీరు చేరుతున్న నేపథ్యంలో ఎడమకాలువ ద్వారా నీరు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి... శుక్రవారం సాయంత్రం 3:40 గంటల నుంచి 4:40 గంటల మధ్యలో నీరు విడుదల చేయనున్నారు. సాగర్ నుంచి పాలేరుకు రావాలంటే కనీసం మూడురోజుల సమయం పట్టనుంది. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లో 17.3 అడుగుల నీటిమట్టం ఉంది. పాలేరు నిండాలంటే 23.6 అడుగులకు నీరు చేరుకోవాలి. అయితే ఎగువన ఉన్న వరదను దృష్టిలో పెట్టుకుని పాలేరు నుంచి కూడా రోజువారీగా నీరు విడుదల చేయబోతున్నారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపే కార్యక్రమంతోపాటు సాగర్ ఎడమకాలువ నుంచి కూడా దశలవారీగా నీరు విడుదల కాబోతోంది. సాగర్ ఎడమకాలువ కింద జిల్లాలో 2.55 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోనూ ఆయకట్టు ఉండడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. ఈ ఏడాది వర్షాలు పడతాయా...? కృష్ణా పరవళ్లు తొక్కుతుందా...? వంటి అనేక అనుమానాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతలో భారీ వర్షాలు కురవడంతో కృష్ణా పరవళ్లు తొక్కి ప్రవహిస్తోంది. దీంతో వానాకాలం సాగుకు డోకాలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే బోరుబావులు, చెరువులు, వర్షాధారం కింద సాగర్ ఆయకట్టులో రైతులు సుమారు లక్ష ఎకరాల వరకు వరినాట్లు వేశారు. సాగర్ నుంచి నీరు విడుదలైతే పూర్తిస్థాయిలో వరినాట్లు పడతాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 585 అడుగులకుగాను 535 అడుగులు చేరుకుంది. శ్రీశైలం నుంచి రోజూ 30 టీఎంసీల వరకు నీరు వస్తోంది. మూడురోజులపాటు ఇదే తీరున నీరు వస్తే సాగర్ డ్యామ్ నిండడంతోపాటు పాలేరు జలాశయం కూడా కళకళలాడుతుంది.

Phone: off: 9121901251
Web: www.mist.edu.in
E Mail:info@mist.edu.in

MOTHER TERESA
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
AUTONOMOUS
SANKETIKA NAGAR, KOTHURU(V), SATHUPALLY - 507303, KHAMMAM DIST., TELANGANA

ADMISSION NOTIFICATION
FOR 1ST B.TECH MANAGEMENT QUOTA
Applications are invited for Management seats for Academic Year 2024-25

COURSE	CODE	TOTAL INTAKE	MANAGEMENT QUOTA (CATEGORY-B/NRI/NRI SPONSORED
Civil Engineering	CIV	60	18
ELECTRICAL AND ELECTRONICS ENGINEERING	EEE	60	18
MECHANICAL ENGINEERING	MEC	60	18
ELECTRONICS & COMMUNICATION ENGINEERING	ECE	60	18
COMPUTER SCIENCE AND ENGINEERING	CSE	120	36
Computer Science and Engineering (Artificial Intelligence and Machine Learning)	CSM	60	18
Mining Engineering	MIN	60	18

Application form & Instructions to candidates are available on institute website. Candidates are required to apply for Category-B seats. Seats will be filled as per the guidelines of Telangana Council of Higher Education. The last date to apply is 21.08.2024 by 5:00PM. For more details contact 9121901251.

Dr. C. Hari Krishna
PRINCIPAL

Mist/Advt/2024, dt.01.08.2024.

వెలుగుమట్ల అర్బన్ పార్క్ ప్రాంతాల్లో

బెరైటీస్ అక్రమ తవ్వకాలు

» రాత్రి వేళల్లోనే తవ్వకం, తరలింపు » పట్టించుకోని అధికారులు



వెలుగుమట్ల ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు జరిపిన బెరైటీస్

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 1: ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్ ప్రాంతాల్లో విస్తారంగా ముడి ఖనిజం బెరైటీస్ నిల్వలు ఉన్నాయి. కోట్ల విలువ చేసే బెరైటీస్ ముడి ఖనిజాన్ని కొందరు అక్రమార్కులు అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు, తరలింపు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్నారు. అక్రమ మైనింగ్‌లు జరిపి అనేక ఏళ్లుగా యథేచ్ఛగా అక్రమంగా రాత్రి వేళల్లో బెరైటీస్‌ను తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం మాత్రం బెరైటీస్ గనుల అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయలేకపోతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రికి రాత్రే అధికారుల కళ్లుగప్పి లారీల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. వైరా రోడ్‌లోని కలెక్టరేట్ ప్రాంతాలకు దగ్గరలోనే ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న కొందరు ఈ బెరైటీస్ అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. రెండు రోజులుగా ఖమ్మం అటవి అర్బన్ పార్క్ ప్రాంతాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఉన్న బెరైటీస్ ముడి ఖనిజాన్ని రాత్రి వేళల్లో తవ్వి తోలకాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతాల్లోని ప్రైవేటు భూముల్లో అక్రమ బెరైటీస్ తవ్వకాలు జరపగా మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి సంబంధిత బెరైటీస్‌ను సీజ్ చేసి వేలంలో విక్రయించారు. దీంతో సంబంధిత భూముల యజమానులు ఆభూముల చుట్టూ ప్రహరిగోడలు నిర్మించుకున్నారు. అయినా అక్రమదారులు ఈ ప్రాంతాల్లోని ఇతర భూముల్లో రాత్రి వేళ్లలో ఎక్సకవేటర్లతో తవ్వకాలు జరిపి లారీల్లో తరలిస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు నిఘా పెట్టి అక్రమంగా తోలకాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వరినాట్లకు అనుకూలమైన కాలం

» వరిలో యాజమాన్య పద్ధతులు పాటించండి
» నార్లు పోయని ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతి, లేకుంటే డ్రమ్‌సీడర్ పద్ధతి మేలు
» వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు



ట్రాక్టర్‌తో దమ్ముచేసుకుంటున్నరైతు

మధిర, ఆగస్టు 1: గత పది రోజులుగా సమృద్ధిగా కురుస్తున్న వర్షాల వల్ల వరినాట్లకు అనుకూలమైన సమయం ఏర్పడింది. రైతులు వరినాట్లకు సన్నద్ధమై నాట్లు వేసుకుంటున్నారు. ఈ తరుణంలో వరిపంటలో యాజమాన్య పద్ధతులు విధిగా పాటించాలని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు రుక్మిణీదేవి, భరత్, నాగస్వాతి రైతులకు సూచిస్తున్నారు.

● నార్లు పోయని ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తుకోవాలి, వరినాటు యంత్రాలు అందుబాటులో ఉన్న చోట్ల ట్రే పద్ధతిలో లేదా పాలిథిన్ షీట్‌పై నారు పోసుకొని, విత్తిన 17-20 రోజుల లోపు విత్తుకోవడం మంచిది.

● ముఖ్యంగా సాగర్ ఆయకట్టు జిల్లాలైన ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో వరి నాట్లు ఆలస్యమైనప్పుడు ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక రకాల నార్లు అందుబాటులో ఉంటే సెప్టెంబరు నెల మొదటి వారం లోపు నాట్లు పూర్తిచేసుకోవాలి.

● ముదురు నారు నాటాల్సిన పరిస్థితుల్లో మొక్కల మధ్య దూరం తగ్గించి దగ్గర దగ్గరగా నాట్లు వేసుకుంటే దిగుబడిపై ఎలాంటి ప్రభావం ఉండదు.

● ఆగస్టులో కూడా అధిక వర్షాలు కురిస్తే వరి పంటలో నారుమడి, ప్రధాన పొలంలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. అగ్గితెగులు మచ్చలను తొలిదశలోనే గుర్తించి ఐసోప్రోథయోలీన్ 1.5మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్+మ్యాంకోజెబ్ 2.5గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

● పొలాన్ని 10-12రోజులు బాగా మురగనిచ్చి దమ్ముచేయాలి. ఆఖరి దమ్ములో ఎకరానికి 16కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 8 కిలోల పోటాష్ నిచ్చు ఎరువులు (అంటే 50కిలోల డీఏపీ, 15కిలోల యూరియా, 14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేసుకోవాలి

● పొలంలో నాటిన 18-20 రోజుల తర్వాత కాండం తొలిచే పురుగు నివారణకు రార్బోఫ్యూరాన్ 3జీ 10కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4కిలోలు ఇసుకలో కలిసి చల్లుకోవాలి.

● దమ్ముచేయకుండా నేరుగా విత్తినప్పుడు నాటు పద్ధతి కన్నా 25శాతం ఎరువును అధికంగా వేయాలి. నత్రజని ఎరువును మూడు సమాన భాగాలుగా చేసి 15-20 రోజులకు పిలకదశలో, చిరు పొట్టదశలో వేయాలి. వరిని నేరుగా విత్తినప్పుడు 45 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్తలు వహించాలని శాస్త్రవేత్తలు సూచించారు.

6న వైరా ఆయకట్టుకు నీటి విడుదల

» ఖరీఫ్ సాగుకు మార్గం సుగమం » రిజర్వాయర్‌లో ప్రస్తుతం 12.3 అడుగుల నీటిమట్టం

వైరా, ఆగస్టు 1: వైరా రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమకాల్వల పరిధిలోని ఆయకట్టులో ఖరీఫ్ వ్యవసాయ సాగుకు ఈనెల 6న నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అధ్యక్షతన ఆయకట్టు పరిధిలోని అఖిలపక్ష రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈనెల 6న సాయంత్రం కుడి, ఎడమకాల్వలకు నీరు విడుదల చేస్తానని ప్రకటించారు. సమావేశంలో అఖిలపక్ష రైతుల అభిప్రాయం మేరకు ముందుగా ఖరీఫ్ సీజన్‌లో నారుమళ్లు పోసుకొని సాగు చేసుకోవడానికిగాను నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే నీటివిడుదల సాధ్యసాధ్యాలపై చర్చించి 6న నీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12.3 అడుగుల నీటిమట్టం ఉందని, నాగార్జున్ సాగర్‌కు వరదనీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో ఇక ఏమాత్రం జాప్యం లేకుండా నీరు విడుదల చేయాలని అఖిలపక్షం కోరింది. ఈ కార్యక్రమంలో వైరా, పూసలపాడు సొసైటీ అధ్యక్షులు బొర్రా రాజశేఖర్, గాలి శ్రీనివాసరావు, అఖిలపక్షం నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, చెరుకూరి చలపతిరావు, కిలారు సురేందర్, మట్టూరి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జీ, పారుపల్లి కృష్ణారావు, కె.అర్జున్‌రావు, చింతనిప్పు మురళీ, మాధవరావు, పాలేటి నర్సింహారావు, మేడూరి రామారావు, తాతా రంగారావు, పొట్టపల్లి శ్రీను, బొర్ల గంగారావు, గొల్లపూడి కృష్ణారావు, శీలం చంద్రశేఖరరెడ్డి, చప్పిడి వెంకటేశ్వరరావు, పణితి సైదులు, మల్లు రామకృష్ణ పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేయాలి

» కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి » 5నుంచి 9 వరకు నిర్వహించాలని ఆదేశం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఇతర అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 1: ఆగస్టు 5 నుంచి 9 వరకు పారిశుధ్యం పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమా న్ని విజయవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. గురువారం సీఎస్ హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికా రులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం క్రింద గ్రామాలు, పట్టణాలలో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు, షెడ్యూల్ ను సీఎస్ వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పారిశుధ్య పచ్చదనాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 5 నుంచి ఆగస్టు 9 వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్ర మం సక్రమంగా అమలయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో వినోద్, డీపీవో హరికిషన్, డీఎంహెచ్‌వో డా. మాలతి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, వైరా, మధిర, సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకం: మాజీ ఎమ్మెల్యే సండ్ర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 1965లో లాల్‌బహదూర్‌శాస్త్రి మంత్రివర్గంలో తొలి అడుగులు పడ్డాయని, 1994 జూలై7న ప్రకాశం జిల్లాలోని ఈదరుమళ్ల గ్రామంలో మందకృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణకు తొలిబీజం వేశారన్నారు. తెలంగాణ రాష్ట్రసాధనలో కేసీఆర్ పాత్ర ఎంత కీలకమో ఎస్సీవర్గీకరణసాధన లో మంద కృష్ణమాదిగ పాత్ర అంతే కీలకమన్నారు. 1995లో నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మేరీ అనే యువతి ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ భవనం ఎక్కినినాదాలు చేసిందని గుర్తుచేశారు. 2000 నుంచి 2004వరకు చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు నిర్ణయం తీసుకుని అమలుచేసిందని ఆ ఫలాలు అందుకున్న క్రమంలో సుప్రీంకోర్టు దిగువబెంచి వర్గీకరణ రిజర్వేషన్లను ఆపిందన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టులోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో వర్గీకరణకు అంగీకారం తెలపడానికి ఆనాడు చంద్రబాబునాయుడు ఏర్పాటుచేసిన రిజర్వేషన్లక కారణమని, గుర్తుచేశారు. ఇందుకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యావాదాలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రధాని మోదీకి అనేకసార్లు వినతిపత్రాలు అందించారన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును గౌరవించి ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు విద్యా, ఉద్యోగ నోటిఫికేషన్లలో మాదిగ ఉపకులాలకు వర్గీకరణ ఫలాలు అందేలా చూడాలని ఇందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం రూరల్ ఎంపీపీ బెల్లం ఉమ, బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి సాధారణ స్థాయికి

● 12రోజుల పాటు కొనసాగిన మొదటి ప్రమాద హెచ్చరిక
● ప్రస్తుతం 40.6అడుగుల నీటిమట్టం



భద్రాచలం వద్ద సాధారణ స్థాయికి తగ్గిన గోదావరి

భద్రాచలం, ఆగస్టు 1: భద్రాచలం వద్ద గోదావరి సాధారణస్థాయికి చేరుతోంది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 44.4అడుగులున్న గోదావరి నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 43 అడుగులకు తగ్గింది. ఉదయం 7 గంటలకు 42.8 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గతనెల 21నుంచి గురువారం వరకు మొత్తం 12రోజుల పాటు మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగింది. కాగా మధ్యాహ్నం 12గంటలకు 41.8అడుగులకు తగ్గగా సాయంత్రం 6గంటలకు 40.6 అడుగులకు తగ్గింది. వరద మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గోదావరి సాధారణ స్థాయికి చేరడంతో గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో సీడీపీవోల బదిలీలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 1: మహిళా శిశు సంక్షేమ శాఖలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు సీడీపీవోలు గురువారం బదిలీలైనారు. బుధవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు అందుకొని గురువారం బదిలీ స్థానాలకు వెళ్లి రిపోర్ట్ చేశారు. మల్టీజోనల్ ఉద్యోగులు కావటంతో రాష్ట ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ అనంతరం బదిలీ ఉత్తర్వులను మెయిల్ ద్వారా పంపారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి కవితను మధిర ప్రాజెక్టుకు, బి శివమ్మను ఖమ్మం రూరల్ నుంచి ఖమ్మం అర్బన్‌కు, కనకదుర్గను తిరుమలాయపాలెం నుంచి సత్తుపల్లికి, పి జయలక్ష్మిని ఖమ్మం రూరల్ నుంచి మణుగురుకు, జె భాలత్రిపుర సుందరిని తిరుమలాయపాలెం నుంచి మధిరకు, శారదశాంతిని మధిర నుంచి ఖమ్మం రూరల్‌కు, బదిలీ చేశారు, భద్రాద్రి కొత్తగుడెం జిల్లాకు సంబంధించి సీహెచ్ నిర్మలాజ్యోతిని చంద్రుగొండ నుంచి కల్లూరుకు, బీ సరస్వతిని అశ్వరావుపేట నుంచి తిరుమలాయపాలేనికి, దారా సలోమిని బూర్గంపాడు నుంచి చంద్రుగొండకు, కె అరుణకుమారిని టేకులపల్లి నుంచి ఇల్లెందుకు, బదిలీ చేశారు. వీరిలో ఎక్కువ మంది గురువారం బదిలీ అయిన స్థానాల్లో సంబంధిత డీడబ్ల్యూవోలకు రిపోర్ట్ చేసి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

మహిళ కడుపులోనుంచి

కణితి తొలగింపు

» ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ » వైద్యులకు పలువురి అభినందనలు



ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 1: 'ఆ మహిళ ఏడాది కాలం గా తీవ్రంగా కడుపు నొప్పితో బాధపడుతోంది.. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ మహిళకు ప్రభుత్వ వైద్యులు ప్రాణం పోశా రు' మాతాశిశు సంరక్షణ కేంద్రం వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం జూలూరుపా డు మండలం గుండెపూడికి చెందిన పైడి కవిత అనే మహిళకు గత ఏడాది నుంచి కడుపులో తీవ్రంగా నొప్పి వస్తోంది. ఎంతో మంది డాక్టర్లకు చూపించుకుని మందులు వాడుతున్నా తగ్గడం లేదు. దీంతో మంగళవా రం ఆమె ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చింది. ఇక్కడ మాతా శిశుసంరక్షణ కేంద్రంలో కవితకు పరీక్షలు నిర్వ హించారు. ఆమె గర్భ సంచిపైన సుమారు కిలో బరువు తో ఉన్న కణితి ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఆమెకు స్కానింగ్ తీయించారు. స్కానింగ్‌లో వైద్యుల అనుమానం నిజం అయ్యింది. కవితకు వివరించిన వైద్యులు తప్పని సరిగా ఆపరేషన్ నిర్వహించాలని చెప్పారు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి గురువారం కవితకు ఆపరేషన్ నిర్వహించారు. ఎంసీహెచ్ పర్యవేక్షకులు డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో గైనకాలజిస్టులు సర్జన్లు డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ మాధురి, డాక్టర్ శ్రీ విద్య కవితకు ఆపరేషన్ నిర్వహించారు. ఆ మహిళ కడుపులో నుంచి సుమారు కిలోకు పైగా ఉన్న కణితిని తొలగించారు. దీంతో ఆ మహిళకు ఉన్న ఆరోగ్య సమస్య తొలగిపో యినట్లైంది. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ ఆస్పత్రి లో ఇంత ఖరీదైన వైద్యం పొందినట్లు కవిత భర్త దుర్గా ప్రసాద్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆ మహిళను మరో రెండు రోజుల పాటు పర్యవేక్షించి ఇంటికి పంపించనున్నట్లు గైనకాలజిస్ట్ విభాగ అధిపతి డాక్టర్ యామిని తెలిపారు. ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందా న్ని ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ అభినందించారు.

జ్వరంతో వ్యక్తి మృతి

● దారిలేక కావడి కట్టి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లిన గ్రామస్థులు

ఆళ్లపల్లి, ఆగస్టు 1: మూరుముల గ్రామాల్లో వాగులపై వంతెనలు, సరైన దారులు లేక చివరకు చనిపోయిన శవానికి కూడా కష్టాలు తప్పడం లేదు. గురువారం ఆళ్లపల్లి మండలం, చంద్రాపురం గ్రామానికి చెందిన కొర్స కమలహాసన్(27) వారం రోజులుగా జ్వరం, కామెర్లుతో బాధపడుతు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. దాంతో కుటుంబ సభ్యులు స్వగ్రామం రాఘవాపూరం పంచాయతీ, చంద్రాపురం తీసుకెళ్తున్న క్రమంలో రాఘవాపూరం (గొగ్గలొల్లగుంపు) నుంచి చంద్రాపురం మధ్య జల్లెరు వాగు, ఒక కిలోమీటర్లదారి లేకపోవడంతో వాహనాలు వేళ్లే పరిస్థితి లేదు, దాంతో గ్రామస్థులు జోరు వర్షంలో డోళి కట్టి మృతదేహాన్ని జల్లేరు వాగు దాటించి ఇంటికి తీసుకేళారు. వాగులపై వంతెనలు లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. మృతుడికి భార్య, ఒక బాబు ఉన్నాడు. కమలహాసన్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గిరిజనులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పించాలి

» ఐటీడీఏ పీవో రాహుల్ » ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గిరిజన కళాశాల విద్యార్థినికి పరామర్శ



విద్యార్థిని పరామర్శిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, ఆగస్టు 1: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న గిరిజన బాలికను గురువారం భద్రాచలం ఐటీడీఏ పీవో బీ రాహుల్ పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థిని ఇంగ్లీషుమీడియంలో విద్యాబోధన ఉండటం వలన సబ్జెక్టుల వారీగా అర్థంకాకపోవడంతో బాధను తల్లిదండ్రులకు తెలియజేసిందని, వారు బాలికకు నచ్చజెప్పి కళాశాలకు పంపారని తెలిపారు. దీంతో బాలిక మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నాంకు పాల్పడిందని, బాలికకు ఎటువంటి ప్రాణపాయ స్థితి లేదని, విద్యార్థినితో స్వయంగా మాట్లాడామని బాలిక, ఆమె తల్లి కోరిక మేరకు బాలిక కోరుకున్న కళాశాలలో ఆమెకు సీటు ఇప్పించి చదువుకునేలా అవకాశం కల్పిస్తామని పీవో పేర్కొన్నారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలను పీవో తనిఖీలు నిర్వహించారు. గిరిజనులకు అందిస్తున్న వైద్య సౌకర్యాలను ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. గర్భిణులు ఇబ్బంది పడకుండా వారి గ్రామాల నుంచి అంబులెన్సులో తీసుకురావాలని, ప్రసవం అయ్యే వరకు పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉందో లేదో పరిశీలించి సరైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు.

సీనియర్ల వేదింపులే కారణమా?

● ఇదిలా ఉండగా కొంత మంది సీనియర్ల మాటలు తననెంతో ఆవేదనకు గురి చేశాయని విద్యార్థిని విలేకర్లతో పేర్కొంది. కాగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి సీనియర్ల వేదింపులే కారణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఆరోపించారు. ఈ క్రమంలో వారు ఐటీడీఏ పీవో బి.రాహుల్‌ను కలిసి ర్యాగింగ్‌ని అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన



రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్, ఆగస్టు 1: బోనకల్ రైల్వే స్టేషన్‌ను గత కొన్ని రోజుల క్రితం సందర్శించిన డివిజనల్ రైల్వే మేనేజర్‌ను అఖిలపక్ష నాయకులు కలిసి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి తగు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. దీంతో మధిర ఐవోడబ్ల్యూ శ్రీనివాసరావు గురువారం బోనకల్ 117 రైల్వేగేటు వద్ద స్థలాన్ని పరిశీలించారు. రైల్వేగేటు పై పది ఏళ్ల క్రితం ఓవర్ బ్రిడ్జి కట్టడంతో ప్రజలు పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు రాకపోకలు సాగించడానికి గానూ ట్రాక్ పై వెళ్తున్నారు. మూడవ రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తైతే పూర్తిగా గోడ కట్టనున్నందున అండర్ బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు సర్వే చేశారు.

విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కలిగించాలి: డీఎస్‌వో

కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 1: చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కలిగించే అంశాలపై శిక్షణ ఇవ్వాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతిరాజు, జిల్లా ఏఎస్‌వో నాగరాజశేఖర్ కోరారు. గురువారం కొత్తగూడెంలోని ఆనందఖని రిసోర్స్ సెంటరులో 'ఇన్‌స్పైర్ మనాక్ 2024'పై కొత్తగూడెం డివిజన్ పరిధిలోని సైన్స్, గణితం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్‌వో చలపతిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల నుంచి తప్పని సరిగా ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు కింద ఎంపికైన ఒక్కొక్క విద్యార్థికి రూ.10వేలు లభిస్తాయని తెలిపారు. ఈ ఏడాది భద్రాద్రి జిల్లా నుంచి 1500 ప్రాజెక్టు రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇన్‌స్పైర్ మనక్ రిజిస్ట్రేషన్, ప్రాజెక్టుల రూపకల్పన నూతన ఆవిష్కరణలపై డీఎఎస్‌వో బి. సంపత్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సనల్‌గా జి. చంద్రశేఖర్, పి. సాయికృష్ణ, కే. వెంకటేశ్వర్లు వ్యవహరించారు. టెక్నికల్ సహాయకులుగా బి. రాజేష్ ఉన్నారు.

వైద్య కళాశాలలో తొలి వార్షిక పరీక్షలు ప్రారంభం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 1: వైద్య కళాశాల మెదటి వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఖమ్మం మెడికల్ కళాశాలలో తొలి ఏడాది అడ్మిషన్ పొందిన విద్యార్థులకు కేఎన్ఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. 12 వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం రెండు హాళ్లల్లో పరీక్షలకు సిట్టింగ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు కనీసం 75శాతం హాజరు ఉన్న వారినే అర్హులుగా తేల్చారు. అయితే మొత్తం 100 మంది విద్యార్థులకు గాను ఒక విద్యార్థి మాత్రమే గైర్హాజరయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరక్కుండా జామర్లు, సీసీ కెమెరాలు, ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల కోసం పరిశీలకులుగా డాక్టర్ శ్యాంసుందర్, చీఫ్ సూపరిన్‌టెండెంట్‌గా డాక్టర్ సరిత తదితరులు వ్యవహరించారు. తొలిరోజు ప్రశాంతంగా పరీక్షలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు.

న్యాయవాద క్రీడా పోటీలు ప్రారంభం

ఖమ్మం లీగల్ ఆగస్టు 1: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా గురువారం సర్దార్‌పటేల్ స్టేడియంలో వాలీబాల్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ప్రారంభించారు. వాలీబాల్ పోటీలో నాలుగు జట్లు పోటీపడ్డాయి. దానిలో మొదటి విజేత గరికసంపత్ జట్టు విజేతగా నిలిచారు. రెండవ విజేతగా మగ్రి ప్రకాష్ జట్టు విజేతలుగా నిలిచారు. కబడ్డీ పోటీలో మూడు జట్లు పోటీ పడ్డాయి. దానిలో విన్నర్ జట్టు కె.కృష్ణ, రన్నర్‌గా గరిక సంపత్ విజేతగా నిలిచారు. ఈ పోటీలకు ఆర్గనైజర్స్ గా తన్నీరు పాపయ్య, తాళ్లవెంకటనారాయణ, మగ్రి ప్రకాష్, రామబ్రహ్మం వ్యవహరించారు.

ప్రత్యేక అధికారి లేకుండా గ్రామసభ ఎందుకు?

» నిలదీసిన ఆదివాసీ సంఘాల నాయకులు » నిరసనల మధ్య భద్రాద్రి గ్రామసభ వాయిదా

భద్రాచలం, ఆగస్టు 1: భద్రాచలంలో గురువారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. పంచాయతీ ప్రత్యేక అధికారి లేకుండా సభ ఎలా నిర్వహిస్తారంటూ అధికారులను ఆదివాసీ సంఘాల నాయకులు నిలదీశారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు గుండు శరత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా ఐటీడీఏ పీవో ఉన్న సమయంలో ఆయన లేకుండా నిర్ణయం తీసుకునే అధికారం ఎవరికి ఉంటుంది అని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎజెండాలోని అంశాలైన కరకట్ట మిగిలిన పనులు పూర్తి, ఇసుక క్వారీకి సంబంధించిన సొసైటీ ఎన్నిక, తాగునీరు తదితర అంశాలుండగా సంబంధిత విభాగాలకు చెందిన ఏ ఒక్క అధికారి పాల్గొనకపోవడం గ్రామసభను అవమానించడమేనన్నారు. ఈ క్రమంలో గ్రామసభలో ఉన్న డీఎల్‌పీవో, పంచాయతీ కార్యదర్శిలు సభా వేదిక నుంచి వెళ్లిపోయారు. ఇదే సమయంలో గిరిజన సంఘాల నాయకులు ప్రత్యేక అధికారిగా ఉన్న పీవో రావాలని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో అర్ధాంతరంగా గ్రామసభ వాయిదా పడింది. ఇదిలా ఉండగా గ్రామసభలో భద్రాచలం పంచాయతీకి సంబంధించిన వారు కాకుండా ఇతర ప్రాంతాలు, రాష్ట్రానికి చెందిన వారిని తరలించినట్లు ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా గ్రామసభ నిర్వహణ తీరుపై వారు ఐటీడీఏ పీవో బి.రాహుల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సభ నిర్వహణపై ఆర్డీవోతో నివేదికను తెప్పించుకుంటానని చెప్పినట్లు ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

మధ్యాహ్నానికే బడికి తాళం..

» విద్యార్థులను ఇంటికి పంపించి తాళం వేసి హెచ్‌ఎం » కామేపల్లి మండలం గోపాలపురంలో ఘటన



తాళం వేసి ఉన్న తరగతి గది

కామేపల్లి, ఆగస్టు 1: విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు వారికి అవసరం ఉన్నపుడల్లా సెలవులు ఇచ్చి విద్యార్థులు జీవితాలతో ఆడుకుంటున్నా రు. ఇదే సంఘటన కామేపల్లి మండలం గోపాలపురం పాథమిక పాఠశాల్లో గురువారం జరిగింది. గోపాలపురం పాథమిక పాఠశాలలో సుమారు 20మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒక్కరే ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు. ఆయన కూడా ఇటీవల బదిలీపై వచ్చారు. అయితే గురువారం ఆ ప్రధానోపాధ్యాయుడు ఆపాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం, అనుమతి తీసుకొని ఏదైన చేయాలి కానీ ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఆయన ఇష్టానుసారంగా విద్యార్థులకు మధ్యాహ్నం సెలవు ఇచ్చి తన పని కోసం వెళ్లాడు. పాఠశాలకు తాళం వేసి విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ విషయం తెలిసిన ఆంధ్రజ్యోతి పాఠశాలకు వెళ్లగా పాఠశాల గదికి తాళం వేసిఉంది. ఇదే విషయంపై కామేపల్లి కాంప్లెక్ హెచ్‌ఎం శైలా వివరణ అడడగా ఎలాంటి అనుమతి తీసుకోలేదని తెలిపారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ముగ్గురు మావోయిస్టుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా గుండాల మండలం అటవీ ప్రాంతంలో ముగ్గురు మావోయిస్టులు, ఒక సానుభూతిపరుడిని పోలీసులు అరెస్టు చేశా రు. భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం ఈ అరెస్టు వివరాలను వెల్లడించారు. గుం డాల మండలం దామరతోగు అటవీ ప్రాంతంలో గత నెల 25న జరిగిన ఎదురుకాల్పుల్లో తప్పించుకుని పారిపోయిన నిషేధిత మావోయిస్టుల కోసం గుండాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జిల్లా స్పెషల్‌పార్టీ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా గు రువారం ఉదయం 6.30గంటల సమయంలో ముగ్గురు పురుషులు, ఒక మహిళ పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని పట్టుకుని విచారించా రు. వారిలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ మావోయిస్టు పార్టీ దళ సభ్యులని, మరొక వ్యక్తి గుండాల మండలం దామరతోగు గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిగా గుర్తించారు. దాంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టైన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంద్రగ్రామానికి చెందిన పొట్టం రాజు 2016లో సీపీఐ మావోయిస్టు పార్టీలో దక్షిణ్ బస్తాన్ డివిజన్‌లో సెకండ్ సెంట్రల్ రీజనల్ కంపెనీలో దళసభ్యుడిగా చేరాడు. 2022లో ఏసీఎంగా ప్రమోషన్ పొందారు. ఇతడు ఇన్‌సాస్ తుపాకీని కలిగి ఉన్నాడు. సుమారు 42 హింసాత్మక సంఘటనలో పాల్గొన్నారు. ఇతని వద్ద నుంచి తుపాకీతో పాటు 22 రౌం డ్లు గల రెండు రోడెడ్ మ్యాగ్జెన్స్, ఆలివ్ గ్రీన్‌యూనిఫాంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బైరాంగడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోల్నార్ గ్రామానికి చెందిన ఓఎం. పాండు అలియాస్ రమేష్ 2021 డిసెంబరులో మావోయిస్టు పార్టీలో దక్షిణబస్తర్ డివిజన్‌లో సెకండ్ రీజనల్ కంపెనీలో దళ సభ్యుడుగా చేరాడు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ దళాలతో కలిసి 19 హింసాత్మక సంఘనలో పాల్గొన్నాడు. అతడినుంచి ఒక 303 తుపాకీ, 12రౌండ్ల బుల్లెట్లు, యూనిఫాం స్వాధీనం చేసుకున్నారు. ఇక పట్టుబడిన మహిళ అయిన ములుగు జిల్లా దూదేకులపల్లి గ్రామానికి చెందిన పూనెం చుక్కి అలియాస్ తేజ 2023 మేలో సీపీఐ మావోయిస్టు పార్టీలో ఏటూరు నాగారం, మహదేవ్‌పూర్ ఏరియా కమిటీలో దళసభ్యురాలుగా చేరింది. పలు హింసాత్మక ఘటనల్లో పాల్గొంది. ఆమెను నుంచి ఒక గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. ఇక గుండాల మండలం దామరతోగు గ్రామానికి చెందిన శ్యామల ముఖేష్ అనే వ్యక్తి మావోయిస్టు సానుభూతిపరుడుగా పని చేస్తున్నాడు. అతడి నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిపై గుండాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమో దు చేశామని ఎస్పీ వివరించారు.

గోదావరి వరద రక్షణ బండ్‌కు నిధులివ్వండి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయం వినతి



సీఎంకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు, ఆగస్టు 1: పినపాక నియోజకవర్గంలోని గోదావరి నది పరివాహక ప్రాంతాల రక్షణ కోసం గోదావరి వరద రక్షణ కట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం సీఎంని కలిసిన ఎమ్మెల్యే పాయం నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ నియోజకవర్గంలోని బూర్గంపాడు, అశ్వాపురం మండలాల గోదావరి నది పరివాహక గ్రామాల్లో వరదలు వచ్చిన ప్రతీసారి ఇబ్బందులు పడుతున్నాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి నది వరద ముంపు ప్రాంతాల అభివృద్ధిని, ముంపు సమస్యను పరిష్కరించడంలో విఫలమవ్వడంతో పాటు నిర్లక్ష్యం చేసిందని సీఎం దృష్టికి తీసుకుపోయానన్నారు. గతంలో 1986, 2022లో గోదావరి నది వరదలు ఉధ్రుతంగా వచ్చినప్పుడు జరిగిన నష్టం, ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గోదావరి నది వరద ముంపు రక్షణ కోసం బూర్గంపాడు మండలం సంజీవరెడ్డిపాలెం నుంచి అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామం వరకు, భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీ నుంచి దుమ్ముగూడెం సున్నంబట్టి గ్రామం వరకు రక్షణ బండ్ ఏర్పాటుకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. దీంతోపాటు నియోజకవర్గంలో పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలైన కరకగూడెం, ఆళ్లపల్లి మండలాల్లో పది పూర్తి అయిన విద్యార్థులకు కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలని సీఎంను కోరానన్నారు. రాష్ట్రంలోని 4 ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ పరిధిలో పలు ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న తెలుగు-2 హిందీ-2, పీఈటీలకు సంబంధించి 378 మందిని అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరినట్లు తెలిపారు.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

సైబర్ నేరాల ఫిర్యాదులు ఆలస్యం చేయొద్దు

● సీపీ సునిల్‌దత్



హాజరైన పోలీస్ అధికారులు
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సీపీ సునిల్‌దత్)

ఖమ్మంక్రైం, ఆగస్టు1: సైబర్ నేరాలలో ఫిర్యాదులు ఆలస్యం చేయొద్దని సీపీ సునిల్‌దత్ అన్నారు. గురువారం నగరంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారులతో గురువారం నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరాల ద్వారా సొమ్ము పోగొట్టుకున్న బాధితులు గంట వ్యవధిలో (గోల్డెన్ అవర్) 1930కు కాల్ చేయడం ద్వారా దొంగిలించిన మొత్తాన్ని స్తంభింప జేసే అవకాశాలు గణనీయంగా పెరుగతాయని అన్నారు. సైబర్‌నేరాలలో ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే కాజేసిన సొమ్మును వే ర్వేరు అకౌంట్లలో బదిలీ చేసి దేశంలోని మారుమూల ప్రాం తాల బ్యాంకుల నుంచి డ్రాచేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధిగా విజుబల్ పోలీసింగ్ అమలు చేయాలని, సమాచార సేకరణలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని అధికారులకు సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేస్తూ గంజాయి సరఫరా, వినియోగాన్ని సమూలంగా నియంత్రించేందుకు దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు ఆకర్షితులైతే బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీ పేర్కొన్నారు. అదేవిధగా నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి మద్యం సేవించి, వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కొత్త క్రిమినల్ చట్టాల అమల్లో భాగంగా పోలీసు అధికారులు సమర్థవంతంగా విధు లు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈసమావేశంలో ఏడీసీపీలు ప్రసాదరావు, నరేష్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి,, రహమాన్, రఘు, శ్రీనివాసరావు, వెంకటేష్, ప్రసన్నకుమార్, రవి, ఫణిందర్, సాంబరాజు, మల్లయ్య, బోజరాజు, సుశీల్‌సింగ్ , నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో మూడో తరగతి విద్యార్థి మృతి



నక్షిత్(ఫైల్)

పాల్వంచ,ఆగస్టు1: పాల్వంచలో జ్వరంతో విద్యార్థి మృతి చెందాడు. పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌కు చెం దిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరభద్రం కుమారుడు నక్షిత్ (8) పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో బాలుడు ఆది, సోమవారాలు జ్వరంతో బాధపడ్డాడు. మంగళవారం జ్వరం కొంత తగ్గడంతో బాలుడిని తన తల్లి దగ్గర ఉంచి వీరభద్రం డీఎస్సీ పరీక్ష కోసం భార్యను హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. కానీ బాలుడికి బుధవారం జ్వరం తిరగబెట్టడంతో నానమ్మ అతడిని పాల్వంచ నుంచి మాధారం తీసుకెళ్లి ముందస్తుగా స్థానిక వైద్యుడితో చికిత్స చేయించింది. కానీ కొద్ది సమయంలో అతడి పరిస్థితి ఆందోళకరంగా మారడంతో బుధవారం రాత్రి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత

సత్తుపల్లిరూరల్, ఆగస్టు1: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపునకు చెందిన కొమరం నరేష్, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె సుష్మను ఆధార్ కార్డ్ అప్‌డేట్ కోసం సత్తుపల్లిలోని ఓ మీసేవా సెంటర్‌కు తీసుకువచ్చారు. ఈ క్రమంలో అక్కడి నుంచి తప్పిపోయిన చిన్నారి కోసం తండ్రి నరేష్ వెతకగా, ఆచూకీ లభ్యం కాకపోవడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. పట్టణంలోని సాయిపూజిత బైక్ పాయింట్ వద్ద తచ్చాడుతున్న చిన్నారి తప్పిపోయిందని భావించి నిర్వాహకులు తమవద్దనే ఉంచుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వెతుకున్న సమయంలో కనిపించడంతో వివరాలు సరైనవి కావడంతో తల్లిదండ్రులకు అప్పగించినట్లు పట్టణ సీఐ కిరణ్ తెలిపారు. పోలీసులకు, సాయిపూజిత బైక్‌పాయింట్ నిర్వాహకులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మంలో ఆటోవాలాల ఫైట్

» అడ్డాలోకి ఆటో తీసుకొచ్చినందుకు దాడి

» చాకుతో దాడి.. ఇద్దరికి గాయాలు

» పోలీసుల అదుపులో నిందితులు

ఖమ్మంక్రైం, ఆగస్టు 1: ఖమ్మం నగరంలో ఆటోలాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు కత్తిపోట్లకు గురయ్యారు. అడ్డాలోకి ఆటో తీసుకువచ్చారని ఇద్దరు ఆటో డ్రైవర్లపై మరో ఆటో డ్రైవర్ బస్తాలు కోసే చాకుతో దాడి చేశాడు.

ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన సాయి, గుమ్మడి రమేష్ అనే ఇద్దరు ఆటో డ్రైవర్లు నగరంలోని జెండాల సెంటర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం అర్ధ రాత్రి నగరంలోని నూతన బస్‌స్టాండ్ అడ్డా వద్దకు రమేష్ తన ఆటోలో సాయిను తీసుకుని వెళ్లాడు. ప్రయాణికులను దింపి అడ్డా సమీపంలో ఆటోను నిలిపి ఉంచగా అక్కడున్న రేవతి సెంటర్‌కు చెందిన ప్రభుదాస్ అనే ఆటో డ్రైవర్‌తో పాటు కొంతమంది డ్రైవర్లు వారి వద్దకు వచ్చి ఆటో అక్కడ పెట్టొద్దని గొడవ చేశారు. దీంతో మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. అనంతరం సాయి, రమేషలు సరితా క్లినిక్ సెంటర్‌కు వెళుతుండగా వారి వెనక రెండు ఆటోల్లో రఘునాథపాలెం మండలం కొయచెలక గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్వర్లు, నగరానికి చెందిన అరవింద్, బాలస్వామి ప్రభుదాస్, కామపోంగు సతీష్, దేవాత్ సంతోష్ చల్లా తరుణ్, దొస్‌వాన్ దుర్గాప్రసాద్‌లు వెళ్లి వారు వెళుతున్న ఆటోను అడ్డగించారు. మద్యం మత్తులో ఉన్న వీరంతా తరువాత ఇద్దరిపై దాడి చేశారు. అనంతరం చింతల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆటోలో ఉన్న బస్తాలు కోసే చాకుతో సాయిపై దాడి చేశాడు. ఈ క్రమంలో అడ్డగించిన రమేష్‌పై కూడా దాడి చేశాడు.

ఈ దాడిలో సాయికి చేతులు, వీపు భాగంలో లోతుగా గాయాలయ్యాయి. అనంతరం వారంతా అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం రమేష్ జరిగిన దాడి గురించి సాయి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వార్డెన్‌పై విద్యార్థుల దాడి

● భద్రాద్రి జిల్లా ఏకలవ్య పాఠశాలలో ఘటన

దుమ్ముగూడెం, ఆగస్టు1: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో నిర్వహిస్తున్న సీతారాంపురం తెలంగాణ స్టేట్ ఏకలవ్య మోడల్ స్కూల్‌కు చెందిన 11వ తరగతి విద్యార్థులు బుధవారం అర్ధరాత్రి హాస్టల్ వార్డెన్‌పై భౌతికదాడికి పాల్పడిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు కొద్ది రోజుల క్రితం హాస్టల్ గదిలో అర్ధరాత్రివేళ సిగరెట్ తాగుతూ గుట్కా నములుతున్న విషయాన్ని గుర్తించిన వార్డెన్ వారిని గట్టిగా మందలించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సదరు విద్యార్థులు బుధవారం అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్ నిలిపేసి నిద్రిస్తున్న వార్డెన్ ముఖానికి దుప్పటి ముసుగు వేసి చేతి కడియంతో పిడిగుద్దులు గుద్దడంతో పాటు, కాళ్లతో తన్ని పారిపోయారు. తనపై దాడి జరిగిన విషయమై వార్డెన్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు.

దీంతో విచారణ నిర్వహించిన ప్రిన్సిపాల్ దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను కొద్దిరోజులపాటు ఇళ్లకు పంపించేందుకు ప్రయత్నించారు. అయితే గురువారం పాఠశాలకు వచ్చిన వారి తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రామకృష్ణ సేవలు అభినందనీయం

● టీఎస్ఎన్‌డీపీసీఎల్ డీఈఈ, ఏడీఈ



రామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, కుటుంబ సభ్యులు


అశ్వారావుపేట, ఆగస్టు 1: విద్యుత్‌శాఖకు మారుతి రామకృష్ణ లాంటి సీనియర్లు ఎంతో అవసరమని, విద్యుత్‌శాఖకు ఆయన అందించిన సేవలు అభినందనీయమని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ డీఈఈ మందయ్య, ఏడీఈ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం రాత్రి వినాయకపురంలో వినాయకపురం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన మారుతి రామకృష్ణ-శ్రీదేవి దంపతులను విద్యుత్ అధికారులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామకృష్ణ విద్యుత్‌శాఖలోనే కాక ప్రజలందరితో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొని పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. శాఖలో ప్రమాదాల మధ్య పనిచేయాల్సి వస్తుందని, ఇలాంటి ఉద్యోగాలలో మారుతి రామకృష్ణ లాంటి వారి సీనియర్ల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినాయకపురం ఏఈఈ సంతోష్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, బిర్రం వెంకటేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED
★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k.
Phone : 8977639662 / 8977639663
AJH-4211

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా సమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజ్ - ఏడిఐటి

స్వదేశాగమనము/ విదేశీయానం.
పుట్టిన రోజు
వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి
లీగల్ నోటీసులు
శ్రద్ధాంజలి
పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం : 9985401672
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347



ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలకు 30 ఎకరాల స్థలం

మణుగూరు, ఆగస్టు 1: మణుగూరు పట్టణంలోని ఉడతానేని గుంపు గ్రామంలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల ఏర్పాటుకు కేటాయించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ రాఘవరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలసి స్థలాన్ని పరిశీలించారు. 30 ఎకరాలకు హద్దులను నిర్ణయించి జెండాలను పాతారు. స్థలాన్ని గుర్తించి కేటాయిస్తున్నట్లు నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్ నివేధికను సమర్పించారు. ఈ స్థలంలో అన్ని వర్గాలకు సంబంధించే విధంగా ప్రభుత్వం నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ విద్యా సంస్థ నిర్మించనున్నారు. ఈ సంస్థ ద్వారా పేద వర్గాలకు నాణ్యమైన విద్యతోపాటు కులమత విబేధాలు తొలగించాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు నియోజకవర్గంలోని మణుగూరులో ఇంటర్నేషనల్ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆందోళనలు

అశ్వారావుపేట, ఆగస్టు 1: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంధా జిల్లా నాయకులు జి.ప్రభాకర్ డిమాండ్ చేసారు. గురువారం అరుణోదయ కళా బృందంతో భారీ ప్రదర్శనగ వచ్చి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కంగాల కల్లయ్య, కుంజా అర్జున్ బాడిస లక్ష్మణరావు, భూ లక్ష్మి, కన్నయ్య, సీతామహాలక్ష్మి, తులసి, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నప్పటికి ప్రజలకిచ్చిన హామీలను నేరవేర్చకుండా కాలయాపన చేస్తుందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ అన్నారు. ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ గురువారం జూలూరుపాడులో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. వినతి పత్రాన్ని తహసీల్దార్ స్వాతి బిందుకు అందజేశారు.

దమ్మపేటలో..

దమ్మపేట: కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరుతూ న్యూడెమక్రసీ ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో



జూలూరుపాడులో నిర్వహించిన ఆందోళన

గురువారం స్థానిక బాలాజీ థియేటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్ధార్ నరేష్‌కు అందజేసారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలలైన ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. చేసిన హామీలు సైతం నామమాత్రంగా చేసారని అన్నారు. వెంటనే తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, గృహ నిర్మాణానానికి 10లక్షలు రూపాయలు ఇవ్వాలని, వాస్తవ సాగుదారులను గుర్తించి 20ఎకరాల రైతులను ఎంపిక చేసి 10 ఎకరాల వరకు రైతుబరోసా ఇవ్వాలని, ధరణీ సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండన్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. హామీలు తప్ప ఆచరణ కనిపించడం లేదని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోలం దుర్గమ్మ, బండి ఆదినారాయణ, కీసరి వెంకటేష్, పందూరి వీరభాబు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: కాంగ్రెస్ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహన ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా గ్యాస్ సబ్సిడీ లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదని, వృద్ధాప్య పించన్లు సకాలంలో అందడం లేదని, గృహ నిర్మాణాల ఊసే లేదని మండల కార్యదర్శి సాయన్న ఆరోపించారు. వెంటనే తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, గృహ నిర్మాణానానికి 10లక్షలు రూపాయలు ఇవ్వాలని, వాస్తవ సాగుదారులను గుర్తించి 20ఎకరాల రైతులను ఎంపిక చేసి 10 ఎకరాల వరకు రైతుబరోసా ఇవ్వాలని, ధరణీ సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అర్జున్, బాబు, శంకర్ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ జితిష్ వి. పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవించే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత వివరించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త పొనుగోటి సంపత్, జిల్లా ప్రాజెక్టు అసోసియేట్ బి. రాము, ప్రాజెక్టు స్థాయి కో ఆర్డినేటర్లు రామకృష్ణ, శ్రీకాంత్, సోని తదితరులు పాల్గొన్నారు.

'ఇబ్బందులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి'

పాల్వంచ రూరల్, ఆగస్టు 1: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకాన్ని రైతులకు ఇబ్బందులు లేకుండా అమలుచేయాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకులతో మాట్లాడారు. రైతు రుణమాఫీ విషయంలో రైతుల్లో నెలకొన్న సందేహాలను వ్యవసాయశాఖ, బ్యాంకర్లు సమన్వయంతో నివృత్తి చేయాలన్నారు.

మత్తుపదార్థాలపై అవగాహన కలిగి ఉండాలి

బూర్గంపాడు, ఆగస్టు 1: బూర్గంపాడులోని ఐటీసీ ఎంఎస్‌కె ప్రథమ్ వృత్తి విద్యా శిక్షణ కేంద్రంలో గురువారం బూర్గంపాడు పోలీసులచే మత్తు పదార్థాల నిషేదిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్ఐ నాగభిక్షం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే నష్టాలను, వాటి వలన వచ్చే అనర్థాలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యం, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ఐటీసీ ఎంఎస్‌కె ప్రథమ్ ఒకేషనల్ సెంటర్ భద్రాచలం క్లస్టర్ హెడ్ నరేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

బూర్గంపాడు, ఆగస్టు 1: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బూర్గంపాడు తహసీల్ధార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి పేర్కొన్నారు. గురువారం బూర్గంపాడు మండల పరిషత్ కార్యలయంలో భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల బస్‌పాస్ మేళా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లతో పాటు 50శాతం రాయితీతో బస్ పాస్ సౌకర్యం కల్పించిందన్నారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి'

జూలూరుపాడు, ఆగస్టు 1: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు చంద్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకృష్ణ, ఎస్‌కె.చాంద్‌పాషా, నాయకులు జి.వీరభద్రం, మహేష్, సామేలు, వీరభద్రం, నవీన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవ నిర్వహణకు సహకారం

భద్రాచలం, ఆగస్టు 1: ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ఆదివాసీ తెగల సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న అందరం కలిసి ఐకమత్యంగా ఉంటూ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుందామని తెలిపారు. పట్టణంలో ర్యాలీ, ప్రముఖుల ప్రసంగాలు ఏర్పాటు చేయనున్నట్లు పీవో పేర్కొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు పట్ల హర్షం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు పచ్చ జెండా ఊపుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించడంతో కొత్తగూడెంలో సంబురాలు నిర్వహించారు. గురువారం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. గత 30 ఏళ్లుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన మందా కృష్ణ మాదిగకు జోహార్లు తెలిపారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే దేశ ప్రధాని మోదీ చొరవ చూపారని గుర్తు చేశారు. ఈ విజయాన్ని వర్గీకరణలో అసువులు బాసిన అమరులకు, ఉద్యమకారులకు అంకితమిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకటించారు. తొలుత భారీ సంఖ్యలో బాణ సంచా కాలుస్తూ మేళతాళాలతో సంబురాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ, ఎమ్మార్పీఎస్ నాయకులు కూసపాటి శ్రీనివాస్, మందా హన్మంత్, సలిగంటి శ్రీనివాస్, మారపాక రమేష్, మందా వెంకటేశ్వర్లు, మంజులా, గాయత్రి, మొగిలి, మోరె భాస్కర్, బొమ్మెర శ్రీనివాస్, దుర్గేష్, సూరిబాబు, ధర్మరాజు, కుమార్,



కొత్తగూడెంలో నిర్వహించిన సంబురాలు

గడ్డం రాజశేఖర్, కనుకుంట్ల శ్రీనివాస్, కనుకు వెంకటేశ్వర్లు, గుణ సురేష్, మోదుగు జోగారావు, సైదులు, రాజ్‌కుమార్, రవీందర్, బాలకృష్ణ, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట, ఆగష్టు 1: ఆర్లపెంట గ్రామంలో రెండురోజుల క్రితం సీతా రామ కాల్వలో పడి మృతి చెందిన బాలుడు వరుణ్ కుటుంబాన్ని దమ్మ పేట మండల కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి పదివేల రూపాయిల ఆర్థికసహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటి ఛైర్మన్ రాఘవరావు, అచ్యుతరావు, సత్యనా రాయణ, రావు గంగాధరరావు, ఎంపీటిసి గూడపాటి వెంకట్రావు, సొసైటి డైరెక్టర్ నాగేశ్వరరావు, రాధాకృష్ణ, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం (బడే), వంకా బాబురావు, తాండ్ర ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌బాబు మృతికి న్యాయవాదుల సంతాపం

మణుగూరుటౌన్, ఆగస్టు 1: జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది సురేష్ బాబు మృతిపట్ల మణుగూరు న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మణుగూరు కోర్టు మెజిస్ట్రేట్ కంభపు సురిరెడ్డి, న్యాయవాదులు రెండు నింషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉద్యోగి కుమారుడికి ప్రోత్సాహకం

మణుగూరుటౌన్, ఆగస్టు 1 : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆసుపత్రి ఉద్యోగి సీహెచ్ బొర్రయ్య కుమారు విజయ్ ఉన్నత విద్యకుగాను ఏరియా యాజమాన్యం రూ.1.48 లక్షల ప్రోత్సాహక నగదు పురస్కారాన్ని అందించింది. ఈ మేరకు గురువారం ఏరియా జీఎం కార్యాలయంలోని జీఎం చాంబర్‌లో జీఎం దుర్గం రామచందర్ ఈ మొత్తాన్ని అందించారు.

పారిశుధ్య సమస్యలపై కౌన్సిలర్ల ధర్నా

ఇల్లెందు, ఆగస్టు 1: ఇల్లెందు మునిపల్ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు వివిధ వార్డుల నాయకులతో కలిసి కార్యకర్తలు కార్యలయం ఎదుట భైటాయించి ధర్నా నిర్వహించారు. పట్టణంలో మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడం వల్లా జ్వరాలు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ధర్నాలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిలర్లు స్వయంగా వివరించిన అధికారులు పట్టించుకొవడం లేదన్నారు.

'ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పాలి'

చుంచుపల్లి, ఆగస్టు 1: అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలను అవమాన పరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క్ మాట్లాడిన మాటలు దారుణమని, ఆడ బిడ్డలకు క్షమాపణ చెప్పాలని కోరుతూ భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు కొత్తగూడెంలో నిరసన వ్యక్తం చేశారు. గురువారం కొత్తగూడెంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళలకు పెద్ద పీట వేస్తామని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో సమూచిత స్థానం కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చి అనంతరం మహిళలకు అసెంబ్లీలో ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ దామోదర్ యాదవ్, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీటీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: శాసన సభలో సీఎం రేవంత్ రెడ్డిమహిళా ఎమ్మెల్యేలను కించ పరిచారని, వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ



కొత్తగూడెంలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల పట్ల సీఎం వైఖరి గర్హనీయమన్నారు.

జీసీసి బదిలీ ఉద్యోగులకు సత్కారం



జీసీసీ మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దమ్మపేట, ఆగస్టు 1: దమ్మపేట గిరిజన సహకార సంస్థలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన మేనేజర్ సుగ్గల నర్సింహారావు, అకౌంటెంట్ పోలారావును ప్రజాప్రతినిధులు, సహకార సిబ్బంది గురువారం కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జీసీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దీపులాల్, నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేనేజర్ పాపారావు, బాలునాయక్, బి కృష్ణ, జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, సొసైటి ఛైర్మన్ ఎల్లిన రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మృతదేహం

అశ్వాపురం, ఆగస్టు 1 : మండలంలోని అమ్మగారిపల్లి గ్రామ సమీపంలోని గోదావరి నదిలో గురువారం ఓ గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని గమనించిన స్థానిక ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించిగా ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుపట్టన్నంతగా కుళ్లిపోయి ఉండడంతో వెంటనే ఖననం చేశారు.

శిథిలావస్థలో జడ్పీ బాలికల పాఠశాల

స్పందించిన సింగరేణి అధికారులు, ఎంఈవో వీరస్వామి

మణుగూరుటౌన్, ఆగస్టు 1: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీబొమ్మసెంటర్ జడ్పీ ఉన్నత బాలికల పాఠశాల శిధిలా వస్థకు చేరుకుంది. ఇప్పటికే ఓ గది రేకులు పగిలిపోవడం, తరగతి గదులు కురుస్తుండడం, స్లాబ్ పెచ్చులూడుతండడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. సమాచారం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి వీరాస్వామి గురువారం ఉదయం పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న గదులను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల శిధిలవస్థకు చేరుకున్న విషయాన్ని నివేదిక రూపంలో ఉన్నత అధికారులకు నివేదించి సమస్య పరిష్కారించాలని కోరుతామన్నారు. ఈ విషయమై తనకు నివేదిక అందజేయాలని ఎంఈవో కోరారు. సింగరేణి మణుగూరు ఏరియా యాజమాన్యం స్పందిం చింది. సింగరేణి అధికారులు పాఠశాలను సందర్శించి పరిశీలించారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో, సింగరేణి అధికారులు

సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.25 లక్షల నిధులు వెచ్చించి మరమ్మతులు చేయిస్తామని హామీనిచ్చారు. పాఠశాలను సందర్శించిన వారిలో డీజీఎం పర్సనల్ సలగల రమేష్ తదితరులున్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

దుమ్ముగూడెం, ఆగస్టు 1: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగ కేటాయింపులకు నిరసనగా తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం తూరుబాక ప్రధాన రహదారిపై బడ్జెట్ ప్రతుల దహనంతో నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ భారతదేశ రైతాంగానికి భారంగా మారిందని, వెంటనే సవరించి అధిక నిధులను కేటాయించాలని సంఘం మండలాధ్యక్షుడు బొల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బిల్లా ముత్యాలరావు, గంప నాగిరెడ్డి, బొల్లి సాయిబాబు, నర్సింహారావు, ఖాదర్‌బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా 'సూర్యపుత్ర'



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాబీర్ పాషా

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 1: నిరుపేదలకు అండగా నిలిచేందుకే సూర్యపుత్ర ఫౌండేషన్ ఆవిర్భవించిందని, చిన్న వయస్సులో సమాజ సేవ చేసేందుకు ముందడుగు వేసిన సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. గురువారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో సూర్యపుత్ర ఫౌండేషన్‌ను ముఖ్య అతిథిగా ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 300 మందికి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పిహెచ్‌కె.హరీష్, పి.మాధవ, ఆర్.కిరణ్‌కుమార్, సీపీఐ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే సహించేది లేదు

పాల్వంచ టౌన్, ఆగస్టు 1: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని మున్సిపల్ డీఈ స్వరూప రాణి హెచ్చరించారు. అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు జరుగుతున్న ప్రాంతంలో తప్పనిసరిగా పర్యవేక్షక్ష సిబ్బంది ఉండాలని ఆదేశించారు. గుత్తేదారులు, నిబంధనల మేరకు పనులను నిర్వహించాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే నిబంధనల మేర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ సిబ్బంది బి.రవి, నగేష్, గుత్తేదారు పైడిపల్లి మనోహర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించిన ఇల్లెందు ఏరియా: జీఎం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 1: సింగరేణి ఇల్లెందు ఏరియా జూలై మాసంలో యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. గురువారం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఉత్పత్తి, ఉత్పాదకతలను వివరించారు. జూలై మాసంలో నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి 2.59లక్షల టన్నులకు గాను 3.41 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 133శాతం సాధించినట్లు వెల్లండిచారు. వెలికి తీసిన బొగ్గును రైల్వే, రోడ్డు మార్గాల ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా రవాణా చేసినట్లు తెలిపారు. వార్షిక ఉత్పత్తిలో ఇప్పటికే 13.47లక్షల టన్నులను సాధించినట్లు ప్రకటించారు. బొగ్గు ఉత్పత్తికి కృషి చేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం మల్లయ్య, ఏజీఎం గిరిధరరావు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, పర్సనల్ అధికారి సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు: ఛైర్మన్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 1: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పారిశుధ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మేనేజరు అంకుషావళి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, కౌన్సిలర్లు రేళ్ల నాగలక్ష్మి, ఆజాం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి, ఆగస్టు 1: ములకలపల్లి కేజీబీవీ హస్టల్ సమస్యల నిలయంగా మారిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ అన్నారు. అక్కడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ములకలపల్లి తహసీల్దార్‌కి వినతిపత్రం అందచేశారు. ములకలపల్లి కేజీబీవీలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వర్షాలకు సరైన మౌళిక సదుపాయాలు పరిసరాలు పారిశుధ్యం సరిగ్గా లేక విద్యార్థులకు విషజ్వరాలు వచ్చి ఆసుపత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

పినపాక, ఆగస్టు 1: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామ శివారులో గురువారం వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి నాటు సారాని పట్టుకుని కేసు నమోదు చేశారు. తోగ్గూడెం గ్రామ శివారులో ఎక్సైజ్ ఎస్ఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమాన స్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద నిషేధిత నాటు సారాయి 4.5 లీటర్లు లభ్యమైంది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా టేకులగూడెం గ్రామానికి చెందిన డి. రాంబాబు, డి.సరేష్‌లుగా పేర్కొన్నారన్నారు. వారి నుంచి నాటు సారాయితోపాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకుని స్టేషన్‌కు తరలించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రణాళిక

పాల్వంచ, అగస్టు 1: పాల్వంచలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసే పాయింట్లను ఆయన సీఐ వినయ్‌కుమార్, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్‌లతో కలిసి సందర్శించారు. ఆయా ప్రదేశాల్లోని అనుకూల, ప్రతికూల పరిస్థితులపై సీఐ, టెక్నీషియన్లతో చర్చించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి కావలసిన వ్యయాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అత్యధిక జన సంచారం కలిగిన పాల్వంచలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి జిల్లా ఎస్పీ ఆదేశాలతో అంచనాలను సిద్ధం చేసి ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో అంబేద్కర్ సెంటర్లో ట్రాఫిక్ నియంత్రించబడుతుందని, ప్రమాదాలు కూడా తగ్గుతాయని అన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సతీష్ కుమార్

'రుణమాఫీ కాంగ్రెస్ ఘనతే'

అశ్వారావుపేట, ఆగస్టు 1: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శింగలదేవీ కనకం అన్నారు. గురువారం మామిళ్లవారిగూడెంలోని వై జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో షేక్ షకీల్, తుట్టి మహేష్, ఇష్టీని కనకం, వగ్గెల లక్ష్మణరావు, సవలం హరీష్, వగ్గెల రత్నాకర్, కట్టం లక్ష్మణరావు, తోట మంగయ్య, సిద్దెల నాగేశ్వరరావు, ఎర్రగొర్ల సుమన్, ఆళ్ల నరసింహారావు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.